**కథ**

# సాపాటు అనే ప్రేమకథ

## "ఛీ! చెత్తభోజనం" అనుకున్నాడు శంకరం వందోసారి.

శంకరం బ్రహ్మచారి. ఉద్యోగరీత్యా ఆ ఊరు వచ్చి రెండునెలలు అయ్యింది. ఊళ్ళో ఉన్న హోటల్ రంభ పేరులో తప్ప ఇంక ఎందులోనూ కస్టమర్స్‌ని ఆకర్షించడానికి పనికిరాదని మూడురోజుల్లో తెలిసిపోయింది. మరింక గత్యంతరం లేదు శంకరానికి. చుట్టుపక్కల వాళ్ళందరికీ అదే ఫైవ్‌స్టార్. లేకపోతే వంట చేసుకోవాల్సిందే. శంకరానికి అదే బేసిక్ ప్రాబ్లెమ్. వంట రాదు.

చిన్నప్పుడు చదువుకునే రోజుల్లోనూ, స్వంత ఊళ్ళో, స్వంత యింట్లో ఉండటం వలన వంట నేర్చుకోవలసిన అవసరం శంకరానికి రాలేదు. వాళ్ళ బామ్మ కూడా ''ఒరేయ్! వంట చేస్తావా. ఆడంగి వెధవా!'' అని ఒకటి రెండు సార్లు గసురుకుంది. దాంతో వంటింటి ఛాయలకి కూడా వెళ్ళేవాడు కాదు. ఆ నష్టం ఇప్పుడు హోటల్ రంభ భోజనంతో తెలిసొచ్చింది. ఇంకొన్నాళ్ళు ఈ భోజనం చేస్తే, పని చెయ్యడానికి ఓపిక లేక, ముందర ఉద్యోగం తర్వాత ప్రాణం రెండూ పోవడం ఖాయం. ఏరా భగవంతుడా అనుకుంటూ మెల్లిగా వచ్చి, సీటులో కూర్చుని, ఆఫీసంతా పరకాయించి చూశాడు. ఇంకా పనులు అందరూ మొదలుపెట్టలేదు.

''ఏమండీ! నాకు డేట్ ఆఫ్ బర్త్ ప్రూఫ్ సర్టిఫికెట్ కావాలి. ఎవరు యిస్తారు?'' అని ఓ సన్నని గొంతు వినిపించింది. శంకరం తల ఎత్తి చూసేటప్పటికి- ఎదురుగా ఒక అమ్మాయి నిలబడి ఉంది. శంకరానికి గుండె కొట్టుకోవడం ఆగినట్టు అనిపించింది. ఈ చిన్న ఊళ్ళో సినిమా హీరోయిన్‌లు కూడా ఉంటారన్నమాట అనుకున్నాడు. అమీషాపటేల్, ప్రీతిజింతా, ఇంకెంటివాళ్ళందరూ కలిసినా యీ హీరోయిన్ ముందర దిగదుడుపే. ఇలా ఆలోచిస్తూ మాట్లాడటం మర్చిపోయాడు.

''ఒరేయ్ గోపీ, ఈయన చూడ్డానికి బావున్నాడు కానీ చెముడనుకుంటానురా! ఆ ముసలాయన దగ్గరకి పద'' అంది పక్కనే ఉన్న పదేళ్ళ అబ్బాయితో.

''అయ్యబాబోయ్! అంత పని చెయ్యకండి అమీషాజింతాగారూ, నా ఉద్యోగం పోతుంది'' అన్నాడు.

''అమీషాజింతా ఏమిటి? ఉద్యోగం పోవటం ఏమిటి?'' అంది అమ్మాయి ఆశ్చర్యపోతూ.

''మిమ్మల్ని చూడగానే తెలిసిందిలెండి. మీపేరు అదే అయివుంటుందని అలా పిలిచాను. అసలు సంగతి ఏమిటంటే ఈ సర్టిఫికెట్ ఇచ్చే బాధ్యత నాది. మీరు ఆ ముసలాయన దగ్గరకు వెళ్ళారనుకోండి, ఈ పని నేను చెయ్యనన్నాననుకుని నాకు మెమో యిస్తాడు'' అన్నాడు.

''నాపేరు జంతికా కాదు, చెగోడీ కాదు, లత. ఇంక సినిమాల్లో వెయ్యడం అంటారా. అంత టాలెంట్ నాదగ్గర లేదు. దయచేసి మీరు యీ సర్టిఫికెట్ యిప్పించండి'' అంది.

శంకరం దృష్టి అంతా ఆమె చెవులకి ఉన్న లోలకులపైన, మెడలోని సన్నని గొలుసు మీద, అందమయిన నుదురుమీదా తారట్లాడుతూ ఉండిపోయింది.

''సార్! సర్టిఫికెట్ త్వరగా యివ్వండి'' అని లత మళ్ళీ అనడంతో ఉలిక్కిపడి ''ఇదిగోనండి. రెండునిమిషాలు'' అంటూ గబగబా చేసేశాడు.

''లతగారూ! సంతకం చెయ్యాల్సిన ఆఫీసరు గారు సీట్లో లేరు. రేపు వచ్చి తీసుకువెళ్ళండి. నేను సంతకం చేయించి ఉంచుతాను'' అన్నాడు. ఆఫీసరుగారు సమయానికి లేకపోవటం కలిసొచ్చింది. రేపు ఈ అమ్మాయిని మళ్ళీ చూడొచ్చు. ఆఫీసరుగారికి మర్చిపోకుండా స్వీటు తినిపించాలి అనుకున్నాడు.

''రేపు మా తమ్ముడిని పంపుతాను. వాడికి యివ్వండి'' అంది లత.

శంకరానికి భగీరథుడు, విక్రమార్కుడు అందరూ గుర్తుకు వచ్చారు.

''ఇది చాలా ముఖ్యం అండీ. మీరే వస్తే బావుంటుంది'' అన్నాడు మరో ప్రయత్నంగా.

''మా తమ్ముడు చాలా గట్టివాడు. ఒరేయ్ గోపీ, నువ్వు జాగ్రత్తగా తీసుకువస్తావా?'' అని అడిగింది. వాడు ఓ! అని తలూపాడు. శంకరం సరే అన్నాడు నీర్సంగా.

మర్నాడు గోపీ వచ్చే సమయానికి సర్టిఫికెట్ రెడీగా ఉంచాడు.

''సార్! మా అక్క కాగితం యివ్వమంది'' అడిగాడు గోపి.

''రెడీగా ఉంది. కానీ మీ ఎడ్రస్ చెప్పవోయ్. ఇందులో రాసుకోవాలి'' అన్నాడు, అసలు ఎడ్రస్ అవసరం లేకపోయినా.

''వెనకాల వీధి, నల్ల అరుగులు, బాదం చెట్టు యిల్లు'' అన్నాడు గోపి.

కరక్టుగా చెప్పావయ్యా! యివీ తెలివితేటలంటే.. మామూలుగా అందరూ తండ్రి పేరు, ఇంటి నెంబరు, వీధి పేరు, యిలాంటివి చెప్తారు. వీడు నాకు కావాల్సిన ఇన్‌ఫర్మేషన్ యిచ్చాడు అనుకుని ''మంచిదోయ్. ఈ సర్టిఫికెట్ తీసుకో'' అంటూ చేతిలో పెట్టాడు.

''ఇంతకీ యీ సర్టిఫికెట్ ఎందుకూ?'' అన్నాడు, ఏదో కాజువల్‌గా అడిగినట్టు. ''ఏదో చదువుకి అప్లయి చెయ్యాలిట'' అని గోపీ తుర్రుమన్నాడు.

ఆరోజు సాయంత్రం శంకరం తన యింటికి వెడుతూ నల్ల అరుగుల బాదం చెట్టు యిల్లు చూద్దామని, అదృష్టం పరీక్షించుకుందామని బయలుదేరాడు. ఇల్లు యీజీగానే దొరికింది. ఇంటిముందు రెండుసార్లు అటూ యిటూ తిరిగాడు. చిన్న తెల్లకుక్కపిల్ల బయటికి వచ్చి అనుమానంగా చూసింది. 'ఇంక లాభం లేదు' అనుకుని ఇంటిదారి పట్టాడు. అప్పుడు ఇంటి మేడ మీద కనిపించింది- ఆకుపచ్చ చీర, ఎర్రరంగు జాకెట్టు. మేడ మీదకు పాకిన తీగల మధ్య రామచిలకలా ఉంది. కుక్క భౌ భౌ అనడంతో గబుక్కున చూపు తిప్పుకున్నాడు. లత కూడా అదే సమయానికి కిందకి చూసింది. గబగబా కిందకి వచ్చింది. ''చాలా థాంక్సండి. యివాళ మీరిచ్చిన సర్టిఫికెట్‌తో అప్లికేషను పంపేశాను. ఇవాళే ఆఖరి రోజు'' అంది. శంకరానికి ఆ అమ్మాయి గొంతు వినిపిస్తోందే తప్ప ఏం మాట్లాడుతోందో తెలియటం లేదు. కళ్ళు చాలా బాగున్నాయి. కాటుక పెట్టుకోకపోయినా ఎంత అందంగా ఉన్నాయో అనుకుంటున్నాడు.

''అబ్బే! మిమ్మల్ని చూడ్డానికి రాలేదండి. మా యిల్లు యిటువైపే. ఇలా వెడుతుంటే మీరు కనిపించారు'' అన్నాడు.

లతకి అర్థం కాలేదు కాసేపు. ''అలాగా! మీ యిల్లు ఎక్కడా?'' అంది.

''రామాలయం దగ్గర'' అన్నాడు.

''అదేమిటి? రామాలయం అటువైపు కదా!

మరి యిటు వచ్చేరేమిటి?'' అంది కొంచెం అర్థమయినా, అర్థం కానట్టుగా.

''నేను అంతేనండి. ఈవెనింగ్ వాక్ కోసం అని చుట్టూ తిరిగి వెడతా'' అన్నాడు. పర్వా లేదు కుర్రాడు తెలివిగానే సమాధానం యిచ్చాడు అనుకుంది.

ఇంతలో కుక్కపిల్ల వచ్చి లత దగ్గర నిలబడింది. ''కుక్కపిల్ల చాలా బావుందండీ'' అన్నాడు, ఏదో మాట మాట్లాడటానికి.

''ఏమోనండీ! మేం పెట్టే బిస్కట్లు అవీ మానేసి, గోపీగాడి పుస్తకాలు, రబ్బర్లు తింటోంది నాలుగు రోజుల నుంచీ'' అంది.

శంకరానికి కుక్కల గురించి, వాటి తిండి గురించి అస్సలు తెలియదు. అయినా ఊరికే ఉండటం ఎందుకని, ''సీజన్ మారుతోంది కదండీ'' అన్నాడు. ''అలాగ. ఉంటానండీ'' అని లోపలికి వెళ్ళిపోయింది. శంకరానికి మెరుపు మాయమయి వెళ్ళిపోయింది.



వారం రోజులపాటు యింటి చుట్టూ ప్రదక్షిణాలు చేశాడు. లత మళ్ళీ మేడపైన కనిపించలేదు.

ఆ అమ్మాయి ఇంట్లో ఎంట్రెన్స్ టెస్ట్‌కి ప్రిపేర్ అవుతోంది. అందుచేత బయటికి రాలేదు. మన శంకరానికి ఏం చెయ్యాలో పాలుపోవటం లేదు. ఇంక గోపీ ద్వారానే రాయబారం పంపాలని నిర్ణయించుకున్నాడు. మర్నాడు సాయంత్రం ఆరుగంటలకి గుడికి రమ్మని ఉత్తరం వ్రాశాడు. గోపీని పిలిచి ''ఈ ఉత్తరం చాలా ముఖ్యమయిన సర్టిఫికెట్. మీ అక్కకే యివ్వాలి. ఎక్కడా పడెయ్యకు. జాగ్రత్త'' అంటూ చేతిలో పెట్టాడు.

ఉత్తరం అయితే యిచ్చాడు కానీ, శంకరానికి చాలా భయంగా ఉంది. ఇదే మొదటిసారి. కాలేజీలో ఫ్రెండ్స్‌ని చూసేవాడు కానీ ఎప్పుడూ తను చెయ్యలేదు. రాత్రి నిద్రలో ఊళ్ళో వాళ్ళంతా కర్రలు పట్టుకు వస్తున్నట్టు కలొచ్చి ఉలిక్కిపడి లేచాడు. ఇంక నిద్ర పట్టలేదు. రోజంతా ఆఫీసులో ఎలా గడిచిందో తెలియదు.

సాయంత్రం స్నానం చేసి అందరి దేముళ్ళని తలుచుకుని శుభ్రంగా తయారయి గుడికి వెళ్ళి కూర్చున్నాడు. టైము చూస్తే ఆరు అవుతోంది. లత వస్తుందో రాదో అన్న అనుమానం బాగా పీడిస్తోంది. గంట గడిచింది. ఛీ! లతకి నేను నచ్చలేదన్నమాట అనుకుని మెల్లిగా లేచాడు. అప్పుడు గుడిలో ధ్వజస్తంభం దగ్గరగా లత కనిపించింది. శంకరానికి కెబిసిలో కోటి రూపాయలు దొరికినంత ఆనందం వేసింది. ఆమెకేసి రెండు అడుగులు వేశాడు. ఇంతలో ''హలో సార్!'' అంటూ గోపీ వచ్చాడు.

'ఇదేమిటి! వీణ్ణి తీసుకువచ్చింది' అనుకుంటూ ముఖంలో ఆశ్చర్యం కనపడకుండా నవ్వు పులుముకున్నాడు.

''అక్కా! నిన్న ఈయన నీకు ఇవ్వమని ఇంకో సర్టిఫికెట్ యిచ్చారు'' అన్నాడు.

''మరి యివ్వలేదేం?'' అంది.

''నిన్న.. నిన్న.. తీసుకువస్తుంటే..'' అని ఆగాడు.

శంకరం కళ్ళు చీకట్లు కమ్మాయి. 'ఉత్తరం లత వాళ్ళ నాన్న చేతిలో పడుండాలి. తన పని అయిపోయింది' అనుకున్నాడు.

''చెప్పరా..ఏం జరిగింది?'' అంది లత.

''నా చేతిలోంచి లాక్కుని..మన టామీ తినేసింది'' అన్నాడు.

శంకరం నిలదొక్కుకున్నాడు. 'లత తన ఉత్తరం చూసి వచ్చిందనుకున్నాడు. ఇంకా నయం, ముందుకు వెళ్ళి అభాసుపాలు కాలేదు' అనుకున్నాడు.

''ఇంతకీ ఏం సర్టిఫికెట్ పంపారండీ'' అంది లత.

''ఓ! అదా! డూప్లికేట్ కాపీలెండి'' అని చెప్పి మెల్లగా దేవుడికి కొబ్బరికాయ కొట్టి యింటికి చేరుకున్నాడు.

ఇంటికి వచ్చేసరికి యింట్లో లైట్లు వెలుగుతున్నాయి.

ఎవరు వచ్చారా అని చూస్తే, అమ్మా, నాన్నా. ''అరే! ఎప్పుడు వచ్చారు? ఉత్తరం కూడా వ్రాయలేదే?'' అంటే-

''మీ అమ్మ నిన్ను చూడాలని అందిరా. వెంటనే బయలుదేరాము'' అన్నారు శంకరం తండ్రి.

వి.వి. రమణ

''ఈ ఊళ్ళో నేను మీకు మంచినీళ్ళు తప్ప ఏమీ యివ్వలేను. స్నానం చెయ్యండి. మా ఊరి ఫైవ్‌స్టార్ హోటల్ చూపిస్తాను'' అన్నాడు.

''ఈ ఊళ్ళో నా స్నేహితుడు ఉన్నాడు. ఇవాళ అందరికీ అక్కడే భోజనం'' అన్నాడు శంకరం నాన్న.

''అహో నా అదృష్టం'' అన్నాడు. ''ఇన్నాళ్ళూ చెప్పలేదేం. పదండి. నాకసలే ఆకలే స్తోంది'' అని బయలుదేరదీశాడు.

'ఆల్ రోడ్స్ లీడ్ టు రోమ్' అన్నట్టుగా శంకరం వాళ్ళ నాన్న నల్ల అరుగుల బాదంచెట్టు యింటికి తీసుకువచ్చారు, ''ఇదే మా ప్రభాకరం యిల్లు'' అంటూ.

శంకరం ఆకలి మర్చిపోయాడు. మేఘాల మీద నడుస్తూ ఇంట్లోకి వెళ్లాడు.

## బాడ్‌లక్

**విదేశాల్లో స్టేజ్‌షోలకు తారలు ప్రత్యేక ప్రాధాన్యతనిస్తారు. అలాంటి స్టేజ్‌షోలు అకస్మాత్తుగా రద్దయితే వారి ఫీలింగ్ ఎలా ఉంటుందో ఊహించుకోండి! 'ఫ్రమ్ ఇండియా విత్ లవ్' పేరుతో లండన్‌లో స్టేజ్‌షోలివ్వడానికి తమ అంగీకారం తెలిపారు అమితాబ్ బచ్చన్, అమీర్‌ఖాన్, ఐశ్వర్యారాయ్, ప్రీతిజింతా. ఇండియా-పాకిస్తాన్ సరిహద్దుల్లో నెలకొని ఉన్న ఉద్రిక్తతల నేపథ్యంలో ఈ టూర్ వాయిదా పడింది. దీంతో అందరికన్నా ఫీలైంది ప్రీతి జింతానే నట.**



''ఇదేనా రావటం'' అంటూ లత వాళ్ళ అమ్మ అందరినీ లోపలికి పిలిచింది.

''ఒరేయ్ రామం'' అంటూ ప్రభాకరం బయటకి వచ్చి శంకరం తండ్రిని కౌగలించుకున్నాడు. కబుర్లు అయ్యాక ''ఒరేయ్! మీ అబ్బాయి యీ ఊళ్ళో ఉన్నట్టు నాకు చెప్పనేలేదు'' అని నిష్టూరంగా మాట్లాడారు ప్రభాకరం.

''నేనే తీసుకు వచ్చి పరిచయం చేద్దామని ఆగానురా!'' అన్నారు రామంగారు.

''సరే భోజనాలు చేద్దాం ముందర'' అంటూ లోపలికి నడిచారు.

''లతా! కంచాలు పెట్టమ్మా'' అన్నారు ప్రభాకరంగారు.

''ప్రభాకరం! మీ లతా! ఇంత పెద్దదయిందే! ఏం చదువుతున్నావమ్మా?'' అని అడిగారు రామంగారు.

'ఏం చదువుల్లేరా! ఎం.సి.ఏ.లో చేరాలిట. ప్రిపేర్ అవుతోంది. అమ్మాయీ! వడ్డించు'' అన్నారు ప్రభాకరంగారు.

శంకరానికి ఎవరు ఏం వడ్డించారో, ఏం తిన్నాడో, ఎప్పుడు భోజనం అయిపోయిందో తెలియలేదు. వడ్డన అంతా లత వాళ్ళ అమ్మగారే చేసింది. లత మధ్య మధ్యలో అందించింది. ఆ టైము వృధా చెయ్యకుండా లతని అనేక యాంగిల్స్‌లో మనసులో ముద్రించుకున్నాడు.

''వంటలు బావున్నాయండీ!'' అంది శంకరం తల్లి.

''అమ్మాయి వంటలు బాగా చేస్తుంది'' అన్నారు రామంగారు.

ఇంక శంకరం ఆనందానికి అంతులేకుండా పోయింది.

అందంగా ఉంది. బ్రహ్మాండంగా వంట చేస్తుంది. ఇంకేం

కావాలి. తనే రాయబారం పంపి పెళ్ళి చేసు

కుంటామంటే పోతుంది. నాన్నగారి ఫ్రెండు కూతురేగా అనుకున్నాడు.

ఇంతలో రామంగారే ''మన శంకరానికి వాళ్ళ అమ్మాయిని యిస్తారుట. నువ్వేమంటావ్?'' అని భార్యని అడిగారు.

''ఈ వెధవకి అప్పుడే పెళ్ళేమిటండీ. తర్వాత చూద్దాంలెండి'' అంది శంకరం తల్లి.

''అమ్మా! నాకు భోజనానికి యిబ్బందిగా ఉంది'' అన్నాడు శంకరం వెంటనే.

''నేను ఓ నెలరోజులు ఉండి నేర్పుతాలేరా! భయపడకు'' అంది మళ్ళీ.

''నీకెందుకమ్మా అంత కష్టం'' అన్నాడు శంకరం.

''నాకు కష్టం ఏమిటిరా? పిల్లాడికి వంట చేసి పెట్టలేనా'' అంటూ శంకరం మొహం వంక చూసి నవ్వింది.

''ఒరేయ్.. నీ సంగతి నాకు ఎప్పుడో తెలుసు, నువ్వు నా కోడల్ని సెలక్టు చేసేసుకున్నావని'' అంది.

శంకరం కళ్ళలో పెళ్ళిపందిరి మెదిలింది. బాజాభజంత్రీలతో పెళ్ళి అయిపోయింది.

మామూలుగా ఆఫీసుకి బయలుదేరేముందు ''లతా భోజనం వడ్డించు. ఆఫీసు టైము అవుతోంది'' అన్నాడు.

''కుక్కరు మూత రావటం లేదు'' అంది లత.

కష్టపడి మూత తీశాడు. లోపల అన్నం సగం ఉడికింది. మిగతాది బయటపడి ఉంది. ఇంకో గిన్నెలో కందిపప్పు ఉంది. నీళ్ళు పోసి లేవు. ''ఇదేమిటి ఇలా చేశావు?'' అన్నాడు.

''నాకు వంట రాదు'' అంది లత భయంగా.

''మరి ఆరోజు మీ నాన్నగారు, అమ్మాయి వంట చేసింది. బాగుంటుంది అన్నారు. మరి అదేమిటి?'' అన్నాడు.

''మా నాన్న, తెలుసున్నవాళ్ళు అందరూ, మా అమ్మని 'అమ్మాయి' అని పిలుస్తారు!'' అంది.

శంకరానికి కళ్ళముందు ఐదు నక్షత్రాల హోటల్ రంభ మెరిసింది.

✪